క్లుప్తంగా

రమాబాయి అంబేడ్కర్‌కు నివాళి



రమాబాయి అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): భారత మాత రమా బాయి అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్ర పటం వద్ద ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మెండెం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. స్థానిక ఎస్‌ఆర్‌పేటలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంతోష్ కుమార్ మాట్లాడారు. వెలివాడ బతుకుల్లో వెన్నెల జ్యోతిని ప్రసాదించిన భారతమాత రమాబాయి అంబేడ్కర్ అని గుర్తుచేశారు. ఆమె ఆశయ సాధనకు కృషి చేయడమే ఆమెకిచ్చే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో గాలాయగూడెం సర్పంచ్ చిలకా సుబ్బారావు, నాయకులు నూకపెయ్యి కార్తీక్, పులవర్తి డేవిడ్, గురజాల రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సెస్ బకాయిలు చెల్లించాలి



కమిషనర్ భానుప్రతాప్‌ను కలిసిన నాయికులు

ఏలూరు (టూటౌన్): గ్రంథాలయ సెస్ బకాయిలను వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం నాయకులు ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్‌ను కోరారు. శుక్రవారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబు, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండీ జుల్ఫీఖర్ ఆలీ కమిషనర్ భానుప్రతాప్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థకు చెల్లించాల్సిన సెస్ బకాయిలు రూ.9.35 కోట్లు ఇప్పించాలని వినతి పత్రం అందించారు. ఈ మాసంలో రూ.20 లక్షలు, వచ్చే నెలలో మరో రూ.20 లక్షలు, మిగతా బకాయి విడుతల వారీగా చెల్లించే ఏర్పాటు చేస్తున్నామని కమిషనర్ భానుప్రతాప్ తెలిపారని నాయకులు వివరించారు. తొలుత జిల్లా జాయింట్ కలెక్టర్‌ను కలిసి జిల్లాలో పేరుకుపోతున్న సెస్ బకాయిలు చెల్లించాలని నాయకులు వినతిపత్రం అందజేశారు.

నివాసాల మధ్యే మురుగు

- జేవీయర్ నగర్‌లో దుర్గంధం
- పందుల సంచారం
- దోమలతో సహవాసం
- పట్టించుకోని అధికారులు
- ప్రజల ఆవేదన

ఏలూరు రూరల్ : డ్రెయిన్ సౌకర్యం లేదు. ఇళ్లలోని వాడకం నీరు పోయే మార్గంలేదు. పరిసర లోతట్టు ప్రాంతాల్లోనే మురుగు నీరు తిష్ట. అక్కడే పందులు సంచారం. దోమలు విజృంభణ ఇలా పలు సమస్యలతో ఏలూరు నగర కార్పొరేషన్ పరిధి 24వ డివిజన్‌లోని జేవియర్ నగర్ ప్రజలు సహవాసం చేస్తున్నారు. తమ మొర ఆలకించే నాథుడు లేదని, తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నాయని వాపోతున్నారు.

తలుపులు, కిటికీలకు మూత

రెడ్డమ్మ స్ట్రీట్‌లో 1, 2 రోడ్లలో డ్రెయినేజీ వ్యవస్థ లేదు. ఈ ప్రాంతంలో సుమారు 40కి పైగా భవనాలు, ఇళ్లు ఉన్నాయి. ఈ భవనాల్లో వాడకం నీరు బయటకు పోయే దారిలేకపోవడంతో లోతట్టు స్థలాల్లో నిలిచిపోతుంది. పందులు సంచారం పెరిగి దుర్గంధం వెదజల్లుతోంది. దోమల కారణంగా చీకటిపడక ముందే స్థానికులు కిటికీలు, తలుపులు మూసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. దోమల బెడదతో పిల్లలు, వృద్ధులు జ్వరాల బారిన పడుతున్నారని మహిళలు వాపోతున్నారు. వర్షాకాలంలో లోతట్టు స్థలాలు మురుగు కూపాలుగా మారుతున్నాయి. ఈ సమస్య వేసవికాలం వరకు కొనసాగతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



24వ డివిజన్ పరిధిలో ఇంటి ముందు కదలని మురుగునీరు



రెడ్డమ్మ స్ట్రీట్ రెండో రోడ్డులో ఇళ్ల మధ్యే మురుగు కూపం



డ్రెయినేజీ లేని వీధి

ఫిర్యాదు బుట్టదాఖలు

డ్రెయినేజీ వ్యవస్థ అభివృద్ధి చేయకపోవడం వల్ల ప్రజలు పడుతున్న అవస్థలను స్థానికుడు ఎం సూర్యచంద్రరావు కొద్దికాలం క్రితం జిల్లా కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదు బుట్టదాఖలయింది. కార్పొరేషన్ అధికారులు ఫిర్యాదుపై కనీసం స్పందించలేదని ప్రజలు వాపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

నిర్లక్ష్యం వల్లే సమస్య



ఈ ప్రాంతంలో పెద్ద పెద్ద భవనాలు ఉన్నాయి. కాని అధికారులు డ్రెయినేజీని అభివృద్ధి చేయలేదు. కనీసం ప్రధాన డ్రెయినేజీని అభివృద్ధి చేసినా చాలు. ఇళ్ల ముందు డ్రెయినేజీలు నివాసితులు నిర్మించుకుంటారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే మా ఇళ్ల మధ్య ఖాళీ స్థలం మురుగుకూపంగా మారింది. రాత్రి వేళ దోమలు వేధిస్తున్నాయి.

– ఎం జ్యోతిప్రసాద్

పందులు పెరిగిపోయాయి



ఖాళీ స్థలాల్లో మురుగునీరు చేరడం వల్ల పందులు సంచరిస్తున్నాయి. రాత్రి, పగలు ఇళ్ల మధ్య ఉంటున్నాయి. వీటివల్ల ఒక్కటే దుర్వాసన వెదజల్లుతుంది. దోమలు పెరిగిపోతున్నాయి. చీకటి పడితే ఇళ్లలోనే ఉండాల్సి వస్తోంది. పిల్లలు జ్వరాలు బారిన పడతారని భయపడుతున్నాం. అధికారులు ఈ ప్రాంతాల్లో డ్రెయినేజీని అభివృద్ధి చేయాలి.

– ఎం సాయిదుర్గ

నేటి నుంచి రామకోటి మహోత్సవాలు



రామకోటి మహోత్సవాల కరపత్రం విడుదల చేసిన ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని రామకోటి 93వ వార్షిక మహోత్సవాలు శనివారం నుంచి ప్రారంభిస్తున్నట్టు రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కుమార్ తెలిపారు. స్థానిక పేరయ్యకోనేరు ప్రాంగణంలోని శ్రీరామ మందిరంలో ఆయన మాట్లాడుతూ ఈ ఉత్సవాలు మార్చి 2వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. నిత్యం ఉదయం మౌన ధ్యానం, భక్తి గీతాలు, హరేరామ సంకీర్తనలు, స్వామి వారికి సహస్రనామ పూజలు, నిత్య హోమాలు, నిత కల్యాణాలు, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్సవాల కరపత్రం విడుదల చేశారు. రామకోటి విశ్వశాంతి సమాజం ప్రతినిధులు మానేపల్లి రామారావు, రవ్వా శ్రీ వెంకట బలరామకృష్ణారావు, దేవరకొండ అచ్యుత కృష్ణ కుమార్, చన్నా వెంకట్రామయ్య, సోమిశెట్టి సురేష్ కుమార్, వేమా హరి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరీని నిర్మూలిద్దాం



వెట్టి చాకిరీ నిర్మూలన పోస్టర్ విడుదల చేసిన జేసీ ధాత్రిరెడ్డి



కార్యక్రమంలో పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తున్న రత్నప్రసాద్

ఏలూరు(మెట్రో): బాలబాలికలతో పనిచేయించడం చట్టరీత్యా నేరమని, వారు తప్పనిసరిగా చదువుకునే విధంగా చట్టాలు ఉన్నాయని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అన్నారు. శుక్రవారం వెట్టి చాకిరీ వ్యవస్థ నిర్మూలన దినోత్సవం సందర్భంగా వెట్టి చాకిరీ వ్యవస్థపై వాల్‌పోస్టర్‌ను ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా జేసీ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో వెట్టి చాకిరీ వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించాలన్నారు. బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా రూపమాపేందుకు అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి సమాజ శ్రేయస్సుకు పాటుపడాలన్నారు.

జేసీ ధాత్రిరెడ్డి

సమాజంలో వెట్టిచాకిరి కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

వెట్టి చాకిరీ వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వెట్టి చాకిరీ వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. వెట్టిచాకిరి వ్యవస్థ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవా భవన్‌లో గ్రామ మహిళా సంరక్షణా కార్యదర్శులకు (మహిళా పోలీసులకు), ప్రభుత్వ శాఖల వారికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు పలు సూచనలు చేశారు. ఏలూరు జోన్ సంయుక్త కార్మిక కమిషనర్ ఎ.రాణి, ఉప కార్మిక కమిషనర్ పి.శ్రీనివాస్ మాట్లాడుతూ నిర్బంధంగా పనిచేయించడం నేరమన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఉప కార్మిక కమిషనర్ పి.శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఎ.శ్రీనివాస్, ఆర్డీఓ అచ్యుత అంబరీష్, సీడబ్ల్యూసీ చైర్మన్ పి.వెంకటేశ్వరరావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావు, మహిళా పోలీస్ ఎస్సై వి.కాంతిప్రియ, ఐసీడీఎస్ పీడీ పి.శారద, డీసీపీఓ సూర్యచక్రవేణి, సమగ్ర శిక్ష ఏపీసీ పంకజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థనా పండుగలు ప్రారంభం



ప్రార్థనా పండుగల ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న పాస్టర్ జ్యోతిరాజు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక మన్నా చర్చి ఆధ్వర్యంలో ప్రార్థనా పండుగలు శుక్రవారం రాత్రి స్థానిక ఇండోర్ స్టేడియం గ్రౌండ్స్‌లో ప్రారంభమయ్యాయి. ప్రభువైన ఏసుక్రీస్తును నిజమైన దేవుడని అంతర్జాతీయ సువార్తికుడు పాల్ దినకరన్ అన్నారు. మన్నా చర్చి బిషప్ ఎలీషారావు అధ్యక్షతన ప్రారంభమైన ఈ పండుగల్లో మన్నా చర్చి అధ్యక్షుడు బిషప్ స్పర్జన్ రాజు మాట్లాడారు. ఉపవాస దీక్షలతో ప్రారంభించిన ఈ పండుగల్లో దేవుని మహిమ ప్రతి ఒక్కరిపై ఉండాలన్నారు. ఏలూరు కతోలిక పీఠాధిపతి బిషప్ జయరావు పొలిమేర వాక్య సందేశం అందించారు. మన్నా చర్చి సీనియర్ పాస్టర్ ఎం జ్యోతి రాజు, సిస్టర్ ఇవాంజిలిన్ పాల్ దినకరన్, బిషప్ పేతురు, బిషప్ తిమోతి బాబు, బ్రదర్ శామ్యూల్ దినకరన్, బ్రదర్ డేనియల్ డేవిడ్సన్ దేవుని సందేశం అందించారు. మన్న చర్చి వర్షిప్ బృందం మధుర సంగీతం, పాటలు, స్తుతి ఆరాధన నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా విశ్వాసులు ఈ పండుగలో పాల్గొన్నారు.

11 వరకు కుష్టు వ్యాధి సర్వే

దెందులూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో పోతునూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది కుష్టు వ్యాధి సర్వే ఈ నెల 11 తేది వరకు చేస్తారని వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం పోతునూరులో వైద్య సిబ్బంది చేస్తున్న సర్వేను పరిశీలించారు. ఎంపీహెచ్‌ఈవో హరి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి లక్షణాలు పరిశీలించి పరీక్షలు చేస్తున్నారు. ఇళ్లకు వచ్చిన వైద్య సిబ్బందికి ప్రతి ఒక్కరూ వివరాలు చెప్పి సహకరించాలని వైద్యాధికారి కోరారు.

చెరువులో వ్యర్థాల తొలగింపు

దెందులూరు: మండలంలోని దోసపాడు గ్రామ త్రాగునీటి చెరువులో శుక్రవారం తామరనాచు వ్యర్థాలను తొలగించారు. వేసవి కాలంలో గ్రామస్తులకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలను చేపట్టారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	14
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	34

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	18
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	26
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	22
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	25
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	34
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	29
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	07
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	12	చిక్కుడు కాయలు	32
వంకాయలు (కాంతులు)	20	బీన్సచిక్కుడు	48
వంకాయలు (తెలుపు)	20	చామదుంపలు	44
బెండకాయలు	40	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	24	కంద	72
కాకర కాయలు	32-44	బీట్‌రూట్	32
బీరకాయలు	00	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	48	ఫ్రెంచ్‌బీన్స్	60
క్యాబేజీ	20	అల్లం	50
క్యారెట్	32	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	32	పాలకూర	10
బంగాళదుంపలు	30	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	10
గోరుచిక్కుడు	44	గోంగూర	07-10
దోసకాయలు	24-28	పుదీనా	05
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

డ్రోన్లతో వ్యవసాయం

- పురుగుమందు పిచికారీకి ఆధునిక సాంకేతికత
- రైతులకు సమయం, ఖర్చు ఆదా



పొలాల్లో డ్రోన్‌తో పిచికారీ చేస్తున్న రైతు

దెందులూరు: వరి పొలాల్లో పురుగుమందు పిచికారీకి గ్రామీణ ప్రాంతాల్లో రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వైపు అడుగులు వేస్తున్నారు. దెందులూరు నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతం సేంద్రియ వ్యవసాయ పథకం అమల్లో ఉన్న ఈ నియోజకవర్గంలో ప్రధాన పంటలు అంతర పంటలు సైతం వేసి రైతులు లాభాలు గడిస్తున్నారు. కూలీలతో చేయించుకోవడం కంటే డ్రోన్లతో పిచ్చికారీ చేయించేందుకు రైతులు మక్కువ చూపుతున్నారు. సమయం, నీరు ఆదా కావడం తద్వారా ఖర్చు తగ్గడం డ్రోన్ల వైపు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఒక ఎకరాకు ఆరు నుంచి పది నిమిషాల లోపు డ్రోన్‌తో స్ప్రే పూర్తవుతుంది. ఇందుకుగాను డ్రోన్ నిర్వహణకు రూ.450 చెల్లించాల్సి ఉంది. అదే కూలీలకు అయితే ఒక ఎకరాకు రూ.550-600 ఇవ్వాలి. కేవలం పది లీటర్ల నీటితో ఒక ఎకరం స్ప్రే చేసి నీటి ఎద్దడి ఉన్న పొలాలకు డ్రోన్లతో స్ప్రే విధానం రైతులకు వరంగా మారింది. కెమికల్ మాత్రం నిర్ణయించిన మోతాదును వాడాల్సి ఉంటుంది. డ్రోన్లు బ్యాటరీ కెపాసిటీని బట్టి రూ.4 లక్షలు, రూ.6 లక్షలు, రూ.10 లక్షలు ఖరీదు ఉన్నాయి. పొలాలకు డ్రోన్లతో పిచికారీ చేయడానికి వ్యవసాయ శాఖ అనుమతిని ఇవ్వటంతో గ్రామీణ ప్రాంత రైతులు ఈ తరహా డ్రోన్లు వినియోగించడానికి ఆసక్తి చూపుతున్నారు. దీంతో ప్రైవేట్ కంపెనీలకు గిరాకీ పెరిగింది.

ఖర్చు ఆదా అవుతుంది



డ్రోన్‌తో పిచికారీ విధానం చాలా సులభంగా ఉంది. సమయం, నీరు, ఖర్చు ఆదా అవుతుంది. రైతులకు చాలా మేలు కలుగుతుంది. నేను డ్రోన్లతోనే పిచికారీ చేస్తున్నాను.

– అలూరి వెంకటేశ్వరరావు, రైతు, జోగన్నపాలెం

రైతులకు శిక్షణ ఇస్తున్నాం



మండలానికి ఒకరిని డ్రోన్‌తో స్ప్రే చేయడానికి శిక్షణ నిమిత్తం ఎంపిక చేశాం. వారికి వ్యవసాయ శాఖ శిక్షణ ఇస్తుంది. శిక్షణ ముగిసిన తర్వాత 80 శాతం సబ్సిడీతో డ్రోన్లు మంజూరు చేస్తాం. అన్ని ప్రాంతాల్లో డ్రోన్లతో పిచికారీ చేయడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు.

– వై.సుబ్బారావు, జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్, వ్యవసాయశాఖ

అక్రమాల కట్టడిపై వినతి



ఎంజాయ్‌మెంట్ భూముల్లో చేపట్టిన నిర్మాణాలు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమలలో రెవెన్యూ శాఖ కనుసన్నల్లో జరుగుతున్న భూ ఆక్రమణలతో పాటు, అక్రమ పొజిషన్, పట్టాల జారీపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని కోరుతూ గ్రామస్తులు తహసీల్దార్ జేవీ సుబ్బారావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఆర్ఎస్ నంబర్ 47లో దొరసానిపాడు గ్రామానికి చెందిన ఒకే కుటుంబంలోని సయ్యద్ తాజుద్దీన్, సయ్యద్ సలీమ్, సయ్యద్ మైనుద్దీన్ అనే ముగ్గురు అన్నదమ్ములకు, ఒక్కొక్కరికీ మూడు సెంట్ల చొప్పున రెవెన్యూ అధికారులు ఇటీవల పొజిషన్ సర్టిఫికెట్లు జారీ చేశారు. దీనిపై కొందరు గ్రామస్తులు స్పందించారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, పక్క గ్రామాల్లో ఇళ్ల, స్థలాలు ఉన్న వారికీ తమ గ్రామంలో స్థలాలు ఇచ్చి, వాటికి అధికారులు పొజిషన్ అండ్ ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారని పేర్కొన్నారు. ఇది సరికాదని, అటువంటి వాటిని రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వ భూముల్లో విద్యారంగ సంస్థల ఏర్పాటుకు లేదా పిల్లల ఆట స్థలాలకు లేదా కమ్యునిటీ హాల్స్ నిర్మాణానికి లేదా స్థానిక నిరుపేదలకు ఇంటి స్థలాలుగా ఇవ్వాలని, అలాగే ప్రజల అవసరాలకు వినియోగించాలని కోరారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

జంగారెడ్డిగూడెం: ఒడిదుడుకులను ఎదుర్కొని పత్తి, మిర్చి పండించిన రైతులకు కనీస ధరలు రాక నష్టపోతున్నారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి కొనుగోలుకు సీసీఐ కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. క్వింటాల్ పత్తికి రూ.10 వేలు, మిర్చికి రూ.25 వేలు కనీస ధరలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం జంగారెడ్డిగూడెంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు బొడ్డు రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ పత్తి, మిర్చి వ్యాపారులు ధరలు తగ్గించి రైతులకు తీవ్రమైన నష్టం కలిగిస్తున్నారని చెప్పారు. గత సంవత్సరం క్వింటాల్ రూ.12 వేలు పలికిన పత్తి ధర ఈ సంవత్సరం పత్తి దిగుబడులు తగ్గిపోవడమే కాకుండా ధర రూ.5600 నుంచి రూ.6300లకే కొనుగోలు చేస్తున్నారన్నారు. ఒకవైపు పత్తి విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందుల ధరలు, వ్యవసాయ ఉపకరణాల ధరలు, వ్యవసాయ కూలీలకు ధరలు పెరిగి ఆందోళన వ్యక్తం చేశారు.

వాహన చోదకులపై 35 కేసులు



వాహన తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లా రవాణా శాఖ వాహన తనిఖీ అధికారులు శుక్రవారం స్థానిక రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల వద్ద సుమారు 130 ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ ధరించని, డ్రైవింగ్ లైసెన్స్ లేని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన చోదకులపై 35 కేసులు నమోదు చేసి ఐదు వాహనాలను సీజ్ చేశారు. ద్విచక్ర వాహనం నడుపుతూ వచ్చిన రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులను నాలుగు బృందాలుగా విభజించి వాహన తనిఖీ అధికారులు కౌన్సిలింగ్ ఇచ్చారు. హెల్మెట్ ధారణ, డ్రైవింగ్ లైసెన్స్ వెంట తెచ్చుకోవాలని సూచించారు. రహదారి భద్రత నియమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తనిఖీల్లో మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ బి.శేఖర్, అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్స్‌పెక్టర్లు ఎండీ జమీర్, వీఎల్ కళ్యాణి, ఎస్. నెహ్రూ, పీ. నరేంద్రబాబు, డీ. ప్రజ్ఞ పాల్గొన్నారు.